క్లుప్తంగా

'కాంస్య' విజేతకు మంత్రి అభినందనలు



మహేందర్‌ను అభినందిస్తున్న మంత్రి సబితారెడ్డి

కందుకూరు: ఇటీవల ఆగ్రాలో నిర్వహించిన జాతీయ స్థాయి క్రాస్‌బౌ షూటింగ్ పోటీల్లో కాంస్య పతకం సాధించిన మండల పరిధిలోని బాచుపల్లికి చెందిన మహేందర్‌ను బుధవారం విద్యాశాఖ మంత్రి సబితారెడి సన్మానించి అభినందించారు. రాష్ట్రానికి, దేశానికి మరిన్ని పతకాలు తేవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు గుండాల సురేష్, బీఆర్‌ఎస్ నాయకుడు నరేష్ పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో యోగా శిక్షణ

హుడాకాంప్లెక్స్: ఈ నెల 29 నుంచి ఉచితంగా ఆన్‌లైన్‌లో యోగా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు శ్రీ షిరిడీ సాయి అష్టాంగ యోగా గురూజీ ఇస్మాయిల్ తెలిపారు. బుధవారం హుడాకాంప్లెక్స్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ భారతీయ యోగా విద్యతో ప్రతీ ఒక్కరికి ఆరోగ్యాన్ని అందించాలనే ఆశయంతో ఆన్‌లైన్‌లో నిర్వహిస్తున్నట్లు వివరించారు. మరింత సమాచారం కోసం ఫోన్ నెం 8121410911లో సంప్రదించాలన్నారు.

రోడ్ల మరమ్మతుకు తక్షణ చర్యలు



ఎన్‌జీఓస్ కాలనీలో గుంతలు పడ్డ రోడ్డును పరిశీలిస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి

ఎల్‌బీనగర్: వర్షకు దెబ్బతిన్న రోడ్లకు వెంటనే మరమ్మతులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని ఎన్‌జీఓస్ కాలనీ లేబర్ అడ్డా వద్ద రోడ్డుపై వర్షాలకు గుంతలు ఏర్పడ్డాయి. స్థానికులు ఈ విషయాన్ని కార్పొరేటర్ దృష్టి తీసుకురావడంతో బుధవారం ఆయన వెళ్లి పరిశీలించారు. రోడ్లకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని డీఈ దామోదర్‌రావు, ఏఈ రాకేష్‌లను కోరారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వనపల్లి శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు శరత్‌కుమార్, న్యూటాన్, జైపాల్‌రెడ్డి, కామేష్, పవన్‌రెడ్డి పాల్గొన్నారు.

యువజన కాంగ్రెస్ జాతీయ ప్లీనరీలో పాల్గొన్న రవికాంత్



ప్లీనరీలో పాల్గొన్న రవికాంత్‌గౌడ్, నాయకులు

కడ్తాల్: కర్ణాటక రాష్ట్ర రాజధాని బెంగళూరులో యువజన కాంగ్రెస్ బెహతర్ బునియాద్ పేరున జాతీయ స్థాయి ప్లీనరీ నిర్వహిస్తున్నారు. బుధవారం నుంచి మూడు రోజుల పాటు జరుగుతున్న ప్లీనరీకి, రాష్ట్రంలోని యువజన కాంగ్రెస్ నాయకులతో పాటు, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు రవికాంత్‌గౌడ్, కల్వకుర్తి నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపోతు అనిల్‌కుమార్‌గౌడ్, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ కార్యదర్శి జంగయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా రవికాంత్‌గౌడ్ మాట్లాడుతూ దేశంలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తెచ్చేందుకు యువజన కాంగ్రెస్ పోషించాల్సిన పాత్రపై జాతీయ స్థాయి ప్లీనరీ సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

సాగర్‌రోడ్డు విస్తరణకు సర్వే షురూ



సర్వే చేస్తున్న అధికారులు

యాచారం: నాగార్జునసాగర్–హైదరాబాద్ రహదారిని ఖానాపూర్ గేట్ నుంచి తమ్మలోని గూడ గేట్ వరకు నాలుగు వరుసల రహదారిగా వెడల్పు చేయడానికి రోడ్డు భవనాలశాఖ సర్వే పనులు ప్రారంభించింది. సాగర్‌రోడ్డుపై వాహనాల రాకపోకలు పెరగడం, తరుచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో రోడ్డు విస్తరణతోనే ప్రమాదాలు నివారించవచ్చనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. అందులోభాగంగానే బుధవారం రోడ్డు భవనాల శాఖ ఇబ్రహీంపట్నం డివిజన్ డీఈఈ వేణుగోపాల్‌రెడ్డి, పలు మండలాల ఏఈఈలు సాగర్‌రోడ్డుపై ఉన్న కల్వర్టులు, కృష్ణాజలాల ఎయిర్‌వాల్వ్‌లను గుర్తించారు. సాగర్‌రోడ్డు విస్తరణపై ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ఇప్పటికే రోడ్డు భవనాల శాఖ ఉన్నతాధికారులతో మాట్లాడిన విషయం తెలిసిందే.

కాంక్రీట్ జంగల్‌లో పచ్చని వనం

కాంక్రీట్ నగరం.. ఉరుకుల పరుగుల జీవితం యోగ క్షేమాలు పట్టించుకోలేని పోటీ ప్రపంచంలో ప్రజలు మానసిక రుగ్మతలకు లోనవుతునున్నారు. ప్రకృతే ప్రథమ చికిత్స అనే మాటను కార్పొరేషన్ అధికారులు ఇనుమడించుకున్నారు. వారు చేపట్టిన మొక్కల పెంపకం ఇప్పుడు సత్ఫలితాలిస్తున్నాయి.

- రెండు ఎకరాల్లో రాక్‌పార్క్
- పర్యాటకులతో కిటకిట
- ఉల్లాసంగా గడుపుతున్న కార్పొరేషన్ వాసులు

బడంగ్‌పేట్: నగర శివారులు కాంక్రీట్ జంగల్‌లో చిక్కుకుంటున్నాయి. ఒకప్పుడు పల్లెటూర్లుగా ఉన్న గ్రామాలు పట్టణీకీకరణలో భాగంగా కార్పొరేషన్‌గా ప్రమోటవ్వడంతో పచ్చని వాతావరణం కనుమరుగవుతోంది. ఎక్కడ చూసిన పచ్చని చెట్టే లేకుండా పోతున్నాయి. ఈ విషయాన్ని గమనించిన కార్పొరేషన్‌అధికారులు, పాలకవర్గం దావుత్‌ఖాన్‌గూడలో రెండు ఎకరాల్లో పచ్చని మొక్కలు పెంచడం ప్రారంభించారు. ఇప్పుడా మొక్కలు చెట్లుగా ఎదిగి పచ్చని నందనవనంగా మారి, ఫలాలు ఇస్తుండటంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు. చుట్టుపక్కల ఉన్న కాలనీలకు చల్లని నీడతో పాటు కాలుష్యం లేని ప్రాణవాయువును అందిస్తున్నాయి.

పూలు, పండ్లనిచ్చే మొక్కల పెంపకం

నిమ్మ, దానిమ్మ, ఉసిరి, సీతాఫలం, వైట్ ఆపిల్, పనస, చింత, వేప, కానుగు, అశోక, కొబ్బరి, సపోట, జామ లాంటి పండ్ల చెట్లు, గులాబీ, పారిజాతం, మల్లె, మందారం, చెమేలి, దామిని, కాగడ, నందివర్ధనం, నల్లమద్ది, సుబాబులు, మనీ ప్లాంట్, లేమన్ గ్రాస్, షోకేజీ మొక్కలతో పాటు ఇంటికి అలంకారంగా ఉండే తీగ లతలు, ఆక్సీజన్ ప్లాంట్స్, లక్ష్మీ దేవికి ఇష్టమైన నూరువరాల పూల మొక్కలు ఏర్పాటు చేశారు. జిందా తిలస్మత్ చెట్లతో పాటు, ఆయుర్వేద మందులకు పనికివచ్చే 30 రకాల మొక్కలు, క్రిస్మస్ చెట్లు, ఫ్రాన్స్ లెక్కలేనన్ని మొక్కలు, చెట్లు ఇక్కడ పెంచుతున్నారు.



అందమైన పూల మొక్కలతో రాక్ పార్కు

రాక్ పార్క్‌లో ఎడారి అందాలు

ఎడారిలో పెరిగే బ్రహ్మజెముడు, నాగజెముడు, వానలు లేకున్నా తట్టుకునే 20 రకాల ఎడారి మొక్కలు, అవి బ్రతకడానికి స్థానికంగా దొరికే రాళ్లను, చిప్పలను, గులకరాళ్లను పేర్చి రాక్ పార్కుగా తీర్చిదిద్దారు. ఎడారి ప్రాంతాన్ని చూసినట్లుగా చక్కని అనుభూతి కలుగుతుంది. ఈత చెట్లు పెరిగి ఈత పండ్లను ఇస్తున్నాయి. ఈ పార్కులోకి వస్తే మనసు ఆనందంతో పాటు చక్కని ఆరోగ్యాన్ని సొంతం చేసుకుంటాము. ఈ ప్రాంతంలోకి కలెక్టర్, అడిషినల్ కలెకర్లు, ఇతర ఉన్నతాధికారులు వచ్చినప్పుడల్లా ఈ వనంలో సేదతీరుతారు.



ఎడారి మొక్కల సోయగం

ప్రశాంతంగా ఉంటుంది



ఈ పార్కు చక్కని వాతారణాన్ని అందిస్తుంది. ఒక్క మొక్క, చెట్టు ఎండిపోకుండా నిత్యం నలుగురు వ్యక్తులు పని చేస్తుంటారు. వాచ్‌మెన్‌ను ఏర్పాటు చేశాం. ఈ పార్కు నా డివిజన్‌లో ఉండడం సంతోషాన్ని ఇస్తుంది. పర్యావరణ అందరి బాధ్యత.

– రాళ్లగూడెం సంతోషిరెడ్డి, కార్పొరేటర్

నిరంతర పర్యవేక్షణ



ముందస్తు ఆలోచనతో పాలక వర్గం కలిసి కౌన్సిల్‌లో తీర్మానం చేసి 23వ డివిజన్‌లో పార్కును ఏర్పాటు చేశాం. నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నాం. ఆయుర్వేద మొక్కలతో పాటు అన్ని రకాల మొక్కలు, చెట్లు పెంచుతున్నాం. ప్రతీ సమావేశంలో కొంత బడ్జెట్ కేటాయిస్తున్నాం. నర్సరీ మొక్కలు సైతం పెంచుతున్నాం చక్కని వనాలు ఏర్పాటు చేయడమే కార్పొరేషన్ లక్ష్యంగా పెట్టుకున్నాం.

– చిగురింత పారిజాత, మేయర్

ఫార్మాసిటీ రైతులకు అన్యాయం

పీసీసీ ప్రచార కమిటీ కార్యనిర్వాహక సభ్యుడు జంగారెడ్డి



విలేకరుల సమావేశంలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

కందుకూరు: ఫార్మాసిటీతో ప్రజలకు నష్టం జరుగుతుందని చెప్పి గెలిచిన తర్వాత పార్టీ మారి ప్రభుత్వానికి మంత్రి వంత పాడుతున్నారని పీసీసీ ప్రచార కమిటీ కార్యనిర్వాహక సభ్యుడు ఏనుగు జంగారెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫార్మాసిటీ రైతులకు రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేస్తోందని ఆరోపించారు. గత జనరల్ ఎన్నికల్లో ప్రత్యర్థి కంటే కందుకూరు మండలంలో మంత్రి సబితారెడ్డికి అధికంగా ఓట్లు పోలైనా ఇక్కడి ప్రజలపై మాత్రం వివక్ష చూపుతున్నారన్నారు. తెలంగాణలో భూముల విలువలు పెరిగాయని చెప్పే పాలకులకు, ఫార్మా రైతులకు అరకొరగా పరిహారం అందించి వారిని ఎందుకు మోసం చేస్తున్నారని ప్రశ్నించారు. ఈ సమావేశంలో జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ కప్పాటి పాండురంగారెడ్డి, నియోజకవర్గ నాయకుడు కొత్త మనోహర్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు ఎస్.కృష్ణనాయక్, పార్టీ నాయకులు ఏనుగు జైపాల్‌రెడ్డి, సయ్యద్ అజీజ్, కత్తుల వెంకటేష్, సంతోష్‌కుమార్ ముదిరాజ్, కత్తుల కృష్ణ, కుమార్, పవన్, భీమేశ్, శివరామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'కదన భేరి' వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఏబీవీపీ నాయకులు, విద్యార్థులు

కందుకూరు: మండల పరిధిలోని నేదునూరులో ఏబీవీపీ నాయకులు కదనభేరి వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ నగర కార్యదర్శి సాయికిరణ్ మాట్లాడుతూ.. ఏబీవీపీ ఆధ్వర్యంలో ఆగస్టు 1న హైదరాబాద్‌లో నిర్వహించనున్న కదన భేరి సభను విజయవంతం చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యా సంస్థలను ధ్వంసం చేస్తూ, విద్యను కార్పొరేట్ చేతుల్లో పెడుతూ, పేదలకు విద్య దూరం చేస్తున్నారని ఆరోపించారు. బాసర ఐఐటీతో పాటు సంక్షేమ హాస్టళ్లలో నాణ్యమైన భోజనం అందించాలని, ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలకు సొంత భవనాలతో పాటు అన్ని సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ సోషల్ మీడియా కన్వీనర్ మణికుమార్, నాయకులు నీలం వంశీ, తల్లోజు భానుచరణ్, మహేశ్, విద్యార్థులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు చర్యలు



పనులను ప్రారంభిస్తున్న మేయర్ దుర్గ

మీర్‌పేట మేయర్ దుర్గ

మీర్‌పేట: కార్పొరేషన్ పరిధిలోని అన్ని డివిజన్లలో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నామని మీర్‌పేట మేయర్ ఎం.దుర్గాదీప్‌లాల్ చౌహాన్ అన్నారు. బుధవారం 10, 11 డివిజన్ల పరిధిలోని ప్రశాంతి హిల్స్ రోడ్ నెం-6లో రూ.5లక్షల హెచ్‌ఎండబ్ల్యూఎస్ నిధులతో చేపట్టనున్న తాగునీటి పైప్‌లైన్ పనులను మేయర్, స్థానిక కార్పొరేటర్ దోమలపల్లి ధనలక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. మంత్రి సబితారెడ్డి సహకారంతో కార్పొరేషన్‌ను అన్ని విధాలా అభివృద్ధి చేస్తున్నామన్నారు. అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించేలా పర్యవేక్షిస్తున్నామని చెప్పారు. అనంతరం మిథులానగర్‌లో నూతనంగా నిర్మిస్తున్న నగరపాలక సంస్థ కార్యాలయ భవన నిర్మాణం పనులను అధికారులతో కలిసి మేయర్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, ఫ్లోర్‌లీడర్ అర్కల భూపాల్‌రెడ్డి, కో ఆప్షన్ సభ్యులు ఎం.ఏ.రజాక్, పల్లె జంగయ్యగౌడ్, డీఈ గోపీనాథ్, బీఆర్‌ఎస్ నాయకులు దోమలపల్లి రాజ్‌కుమార్, ఏఈ శ్రీనివాస్, జలమండలి ఏఈ వివేక్ కాలనీవాసులు పాల్గొన్నారు.

తండాల అభివృద్ధికి నిధులివ్వండి

మంత్రిని కోరిన సర్పంచ్ రాజు

మహేశ్వరం: అభివృద్ది పనులకు నిధులుమంజూరు చేయాలని నాగుల్‌దోని తండా సర్పంచ్ రాజునాయక్ బుధవారం మంత్రి సబితారెడ్డిని కోరారు. ఈ మేరకు ఆయన మీర్‌పేట్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆమెకు వినతిపత్రం అందజేశారు. ఇందుకు మంత్రి సానుకూలంగా స్పందించి నిధుల మంజూరుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చినట్లు సర్పంచ్ తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో ఉప సర్పంచ్ ఊర్మిల నాయక్, తండా వాసులు గోపాల్ నాయక్, తేజ నాయక్, రాందాస్ నాయక్, గోవింద్ నాయక్, రవి నాయక్, హరిసింగ్, శంకర్ నాయక్, మోహన్ నాయక్, పత్యానాయక్, హచ్చు, లక్ష్మణ్, హర్యా నాయక్, రాములు, యాదు నాయక్, దీప్లా నాయక్, బోడియా, శివ్ల నాయక్ తదితరులు పాల్గొన్నారు.

హరితహారంతో సత్ఫలితాలు

ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి



మొక్కలు నాటిన ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం: హరితహారంతో మంచి సత్ఫలితాలు అందుతున్నాయని ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి తెలిపారు. హరితహారంలో పెరిగిన చెట్ల వల్లే వర్షాలు కురుస్తున్నాయని చెప్పారు. బుధవారం ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలో 9వ విడత హరితహారాన్ని ప్రారంభించి, ఇంటింటికి ఆరు పండ్లు, పూల మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలను పెంచి పర్యావరణాన్ని కాపాడాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ స్రవంతి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వెంకటరమణారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ యాదగిరి, కౌన్సిలర్లు భానుగౌడ్, భర్తకి జగన్, మమత, సుజాత, బీఆర్‌ఎస్ నాయకులు మల్లేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

'మణిపూర్' నిందితుల్ని ఉరితీయండి



కందుకూరు చౌరస్తాలో సీపీఎం నాయకుల నిరసన

సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు రాంచందర్

కందుకూరు: మణిపూర్‌లో మహిళలను అత్యాచారం చేసిన నిందితుల్ని ఉరితీయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు దుబ్బాక రాంచందర్ డిమాండ్ చేశాడు. బుధవారం సీపీఎం మండల కార్యదర్శి బుద్దీరపు శ్రీనివాస్ ఆధ్వర్యంలో కందుకూరు చౌరస్తాలో మణిపూర్ ఘటనకు వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహించి శ్రీశైలం రహదారిపై నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా రాంచందర్ మాట్లాడుతూ.. మణిపూర్ రాష్ట్రంలో డబుల్ ఇంజన్ సర్కార్‌గా బీజేపీ ప్రభుత్వం మహిళలకు రక్షణ కల్పించలేకపోయారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మైతీలు, కుకీల మధ్య ఘర్షణలతో గ్రామాలు తగలబడుతున్నా, మహిళలపై హత్యలు, అత్యాచారాలు జరుగుతున్నా పట్టించుకోని ప్రభుత్వం గద్దె దిగాలన్నారు. దేశంలో అల్లర్లు జరుగుతున్నా ప్రధాని మాత్రం విదేశీ పర్యటనలు చేస్తూ పట్టించుకోకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. కాలయాపన చేయకుండా అక్కడి సీఎంను బర్తరఫ్ చేసి, పరిస్థితిని చక్కదిద్దేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు అంకగల్ల కుమార్, బి.బాల్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

టీఎస్‌ఎస్‌ఎఫ్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవీంద్ర చౌహాన్

మహేశ్వరం: ప్రభుత్వ హాస్టళ్లు, పాఠశాలలు, కళాశాలలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని టీఎస్‌ఎస్‌ఎఫ్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎస్‌సీహెచ్. సవీంద్ర చౌహాన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం టీఎస్‌ఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో మండల పరిధిలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ హాస్టళ్లను ఆయన సందర్శించి విద్యార్థుల సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం సమస్యల పరిష్కారంలో విఫలమైందని ఆరోపించారు. పెరిగిన చార్జీలకు అనుగుణంగా విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ విద్యాసంస్థల తీరు దయానీయంగా ఉందని స్వయంగా సీఎం మనువడు హిమాన్ష్ ఇటీవల అన్నారని గుర్తు చేశారు. అధికారులు స్పందించిన హాస్టల్ విద్యార్థుల సమ్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేదంటే టీఎస్‌ఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సుమన్, శివ, అశోక్, మల్లేశ్, గోపాల్, రాములు పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.



హాస్టల్ విద్యార్థుల సమస్యలు తెలుసుకుంటున్న టీఎస్‌ఎస్‌ఎఫ్ నాయకులు

ప్రజారోగ్య పరిరక్షణే ప్రభుత్వ ధ్యేయం

ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి

కడ్తాల్: ప్రజారోగ్య పరిరక్షణే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. మండల పరిధిలోని పలువురు బాధితులకు సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులు మంజూరయ్యాయి. ఈ చెక్కులను బుధవారం ఎమ్మెల్సీ నివాసంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బాధిత కుటుంబసభ్యులకు చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ పేద ప్రజలకు మెరుగైన వైద్యాన్ని అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిరతరం కృషి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు సుమన్, రఘురాములు, సురేందర్ రెడ్డి, వెంకట్‌రెడ్డి ఉన్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

బడంగ్‌పేట మేయర్ పారిజాత



అధికారులతో మాట్లాడుతున్న మేయర్

బడంగ్‌పేట్: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో ప్రజలు ఇబ్బందులు పడకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని బడంగ్‌పేట కార్పొరేషన్ మేయర్ చిగురింత పారిజాత అన్నారు. ఈ మేరకు బుధవారం ఆమె చాంబర్‌లో అధికారులు, శానిటేషన్ వర్కర్లతో వేర్వేరుగా అత్యవసర సమీక్షా సమావేశం నిర్వహించారు. వర్షాల వల్ల కాలనీల్లో, డివిజన్లలో ఎలాంటి విపత్తులు, సమస్యలు, ప్రమాదాలు జరుగకుండా అధికారులు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అత్యవసర ఇబ్బంది కలిగిన వెంటనే వాటిని తీర్చేలా అధికారులు వ్యవహరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ సుమన్‌రావు, డీఈఈలు అశోక్‌రెడ్డి, జ్యోతి, మేనేజర్ నగేష్, ఆర్వో చంద్రశేఖర్‌రెడ్డి, ఏఈ వినీల్‌గౌడ్, శానిటేషన్ ఇన్స్‌పెక్టర్ యాదగిరి, శానిటేషన్ సిబ్బంది తదితరులున్నారు.

'చలో కలెక్టరేట్'ను విజయవంతం చేయండి



కందుకూరు: పంచాయతీ కార్మికుల ర్యాలీలో పాల్గొన్న సీఐటీయూ నాయకులు

సీఐటీయూ మండల కన్వీనర్ బాల్‌రాజ్

కందుకూరు: సమస్యల పరిష్కారం కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో మండల పరిషత్ కార్యాలయం ఎదుట చేపట్టిన గ్రామ పంచాయతీ కార్మికుల సమ్మె బుధవారంతో 21 రోజులకు చేరింది. సమ్మెలో భాగంగా గురువారం నిర్వహించనున్న చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కన్వీనర్ బుట్టి బాల్‌రాజ్ మాట్లాడుతూ.. 21 రోజులుగా సమ్మె చేస్తున్నా కార్మికులను పాలకులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వం మొండి వైఖరి వీడకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కారోబార్లు బాల్‌రాజ్‌గౌడ్, దశరథ, యాదయ్య, మహేశ్, కార్మికులు రాములు, యాదయ్య, జంగయ్య, చెన్నమ్మ, శ్యామల, సుగుణ, జంగమ్మ, రాధ, రాములమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆ పంచాయతీ కార్యదర్శి మాకొద్దు

- వార్డు సభ్యులంటే ఆయనకు గౌరవం లేదు
- ఎంపీడీఓకు ఫిర్యాదు



ఎంపీడీఓకు ఫిర్యాదు చేస్తున్న వార్డు సభ్యులు

ఇబ్రహీంపట్నం రూరల్: అవినీతికి పాల్పడుతున్న పంచాయతీ కార్యదర్శి తమకొద్దని పోల్కంపల్లి గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు ఎంపీడీఓకు మొరపెట్టుకున్నారు. గ్రామంలో అభివృద్ధి పనులు చేయాలంటే పైసలు అడుగుతున్నారని ఆరోపించారు. అందువల్ల వెంటనే విధుల్లో నుంచి తొలగించాలని ఎంపీడీఓకు బుధవారం ఏడుగురు పంచాయతీ వార్డు సభ్యులు ఫిర్యాదు చేశారు. కార్యదర్శి రాధ అడ్డగోలుగా వ్యవహరిస్తున్నారని, వార్డు సభ్యులకు మార్యాద ఇవ్వడం లేదని వాపోయారు. జమ ఖర్చుల పేరుతో రూ.4 లక్షలకు పైగా కాజేశారని ఆరోపించారు. కార్యదర్శిపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి తీసుకోవాలని ఎంపీడీఓకు వినతిపత్రం అందజేశారు. ఎంపీడీఓకు వినతిపత్రం ఇచ్చిన వారిలో వార్డు సభ్యులు యాదిరెడ్డి, స్వరూప, శోభరాణి, మహేష్‌గౌడ్, మహేందర్‌రెడ్డి, బాలమణి, మల్లమ్మ, లింగస్వామి ఉన్నారు.

వర్షాలకు పొంగిపొర్లుతున్న డ్రైనేజీలు

- బురదతో కంపుకొడుతున్న రోడ్లు
- సమస్య పరిష్కారంపై దృష్టి పెట్టని అధికారులు

దిల్‌సుఖ్‌నగర్: జోరుగా కురుస్తున్న వర్షాలకు మలక్‌పేట్ జోన్ పరిధిలో కాలనీలు, బస్తీల్లోని డ్రైనేజీలు పొంగిపొర్లుతున్నాయి. రోడ్లపై పారుతున్న మురుగు నీటితో స్థానికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆర్‌కేపురం, సరూర్‌నగర్ , ఓల్డ్‌మలక్‌పేట్, అక్బర్‌బాగ్, సలీంనగర్, తీగలగూడ, సింగరేణీకాలనీ, అంబేడ్కర్‌నగర్, ఎన్‌టీఆర్‌నగర్ తదితర ప్రాంతాల్లోని కాలనీలు, బస్తీలలో డ్రైనేజీ పైపులు లీకై మురుగునీరు పొంగిపొర్లుతోంది. డ్రైనేజీ నీరుతో రోడ్లన్నీ బురదమయంగా మారి కంపుకొడుతున్నాయి. ఈ విషయంపై స్థానిక జీహెచ్‌ఎంసీ అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదు. సంబంధింత అధికారులు వెంటనే స్పందించి డ్రైనేజీ పైపులైన్లకు మరమ్మతు చేయాలని, అదే విధంగా వర్షం వల్ల పేరుకుపోయిన చెత్తను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. అధికారులు స్పందించకపోతే జీహెచ్‌ఎంసీ కార్యాలయం ముందు ఆందోళన చేపడతామని హెచ్చరిస్తున్నారు.



ఎన్‌టీఆర్‌నగర్‌లో రోడ్డుపై పారుతున్న మురుగు

అధికారుల పర్యటనకే పరిమితం

కాలనీలలో ముంపునకు గురైన లోతట్టు ప్రాంతాలను ప్రజాప్రతినిధులు, అధికారులు సందర్శించి బాధితులను ఆదుకుంటామని, భవిష్యత్‌లో ఇలా పరిస్థితి రాకుండా చూస్తామని హామీ ఇచ్చినా పనులు మాత్రం జరగటం లేదు. నాలాల సామర్థ్యాన్ని పెంచకపోవడం, పూడికతీత పనులు చేపట్టకపోవడంతో సమస్య అలాగే మిగిలిపోతోంది. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని వరదల వల్ల ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేయాల్సిన అధికారులు విఫలమవుతున్నారు. వర్షం వచ్చినప్పుడల్లా ఇళ్లల్లోకి నీరు వస్తోందని. ఇళ్లల్లో ఉండలేని పరిస్థితులు నెలకొన్నాయని ముంపు బాధితులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి డ్రైనేజీ సమస్యలను వెంటనే పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.